క్లుప్తంగా

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా సిద్ధార్థ



ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్‌గా జి. సిద్ధార్థ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన ఎం. లీలాసంజీవకుమారి సాధారణ బదిలీల్లో భాగంగా నకరికల్లు మండలానికి వెళ్లిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో గుంటూరు కలెక్టరేట్‌లోని డీ అండ్ హెచ్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిద్ధార్థను ప్రత్తిపాడు తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్తామని తెలిపారు.

బీజేపీకి జగన్‌ని విమర్శించే హక్కు లేదు

జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్

గుంటూరు రూరల్ : విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీకి, ఆ పార్టీ నాయకులకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే హక్కు లేదని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల నుంచి అభివృద్ధి జరగ లేదంటూ ముఖ్యమంత్రి జగన్‌ని విమర్శిస్తూ తీవ్ర పదజాలంతో మాట్లాడారన్నారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పి, తర్వాత ఊసరవెల్లిలా మాటలు మార్చి చేతులెత్తేసిన ఘనత బీజేపీదని ప్రజలందరికీ తెలుసని ఆయన గుర్తు చేశారు. జగన్‌ని విమర్శించే ముందు బీజేపీ ప్రభుత్వం ఆంధ్రకు ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆంధ్రకు ప్రత్యేక హోదా ప్రకటించి అప్పుడు జగనన్నని విమర్శించాలని తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

చేబ్రోలు: ఆర్టీసీ బస్సు ఢీకొని మోపెడ్‌పై వెళుతున్న వృద్ధుడికి గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. వడ్లమూడి గరువుపాలేనికి చెందిన సూరగాని సుబ్బారావు మోపెడ్‌పై ఇంటికి వెళ్తున్న సమయంలో గుంటూరు నుంచి తెనాలి వెళ్తున్న ఆర్టీసీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో సుబ్బారావుకు తలకు, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబంలో కలతల కారణంగా యువకుడు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కొత్తరెడ్డిపాలెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన దానబోయిన గోపి కొద్ది రోజులుగా కుటుంబ సమస్యలతో సతమతమవుతున్నాడు. సోమవారం రాత్రి మద్యంలో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గమనించి 108 వాహనం ద్వారా పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేధా సంపత్తి హక్కు, ఉపాధి అవకాశాలపై వెబినార్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్-రెగ్యులేటరీ అఫైర్స్, నాగపూర్‌లోని రాజీవ్‌గాంధీ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ సంయుక్తంగా సోమవారం మేధా సంపత్తి హక్కు, ఉపాధి అవకాశాలపై వెబినార్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఎన్ఐఐపీఎంకు చెందిన అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ డాక్టర్ భరత్ ఎన్. సూర్యవంశీ వివిధ రకాల మేధో సంపత్తి హక్కులు, నమోదు చేసే పద్ధతులు, వివిధ రకాల పేటెంట్స్, డిజైన్స్ వాటి నిర్ణీత కాల పరిమితి, పేటెంట్ పొందిన వారి హక్కులు, ఉపాధి అవకాశాల్ని వివరించారు. ఆయా అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, అధ్యాపకులు పాల్గొన్నారు.



నారాకోడూరు జెడ్పీ హైస్కూలులో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



చేబ్రోలు సూర్యదేవర నరసయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ...



పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో...

విద్యాభివృద్ధి రస్తు...

- పాఠశాలల ప్రారంభం రోజే విద్యాకానుక కిట్ల పంపిణీ
- విద్యార్థుల్లో ఆనందం

చేబ్రోలు: విద్యార్థులంతా క్రమశిక్షణ, అంకితభావంతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని చేబ్రోలు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి సూచించారు. చేబ్రోలు మండలం నారాకోడూరు, శేకూరు, చేబ్రోలు, వేజండ్ల జెడ్పీ హైస్కూళ్లలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునఃప్రారంభం అయిన మొదటి రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్స్, నోట్ పుస్తకాలు, పెన్నులు, బ్యాగ్ తదితర సామగ్రిని ప్రభుత్వం అందజేసింది. శేకూరు, నారాకోడూరు, వేజండ్ల జెడ్పీ హైస్కూళ్లలో జరిగిన నాలుగో విడత జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీలో ఎంపీపీ కె. సాహితి మాట్లాడుతూ అక్షరాస్యత ద్వారా అభివృద్ధి సాధ్యమనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. జీడీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు మాట్లాడుతూ అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా విద్యార్థుల్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. చేబ్రోలు గ్రామ సర్పంచ్ అత్తోట వినీతా రాణి మాట్లాడుతూ పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్బారావు, కాసు ఈశ్వరరెడ్డి, కె. కిరణ్‌కుమార్, మాతంగి శ్యామల, రాధాకృష్ణ, ఎం. ఏడుకొండలు, అంకమ్మరావు, మేకల సుబ్బారావు, ప్రసాద్, విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బోధన

పెదకాకాని: పేద విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలతో బోధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పెదకాకాని, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని ప్రయోజకులు కావాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో బడులు తీసి ఆరునెలలు గడిచినా పాఠ్య పుస్తకాలు అందని పరిస్థితి ఉండేదన్నారు. విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి ప్రభుత్వ విద్యను కార్పొరేట్ పాఠశాలలకు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. జగనన్న గోరుముద్ద ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన సంపూర్ణ ఆహారంతో పాటు గుడ్డు, చిక్కీ, రాగిజావ అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో ..

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని మార్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్ పసుపులేటి శివకుమారి, పీఎంసీ చైర్మన్ సుజాత, హెచ్ఎం సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ప్రత్తిపాడు: ఏపీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని వట్టిచెరుకూరు జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి అన్నారు. వట్టిచెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్ల ప్రారంభోత్సవం హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, షూస్, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో కూడిన కిట్లును అందజేశారు. అనంతరం పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు, భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో సైతం పాతిక శాతం సీట్లు పేదలకు కేటాయించేలా ఉత్తర్వులు జారీ చేసిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్య ప్రభుత్వ బడుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో గుణాత్మక విద్యను అందిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి అన్నారు. మండల పరిధిలోని యనమదలలో సోమవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జేవికే కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎంఈవో రమాదేవి, గ్రామ సర్పంచ్ జి. ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు నేలపాటి స్వప్న, పార్టీ మాజీ మండల కన్వీనర్ గట్టు విజయ్‌కుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్లు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యతో విధి రాతను మార్చవచ్చన్నారు. కార్యక్రమంలో బండారు ఏడుకొండలు, ఆకుల సుబ్బారావు, బైనబోయిన అప్పారావు, ఎన్. భాగ్యారావు, వెంకటసుబ్బయ్య, బాలస్వామి. వరికల్లు శ్రీను పాల్గొన్నారు.



పెదనందిపాడు మండలం అన్నపర్రు పాఠశాలలో...

పెదనందిపాడులో..

మండలంలోని అన్ని పాఠశాలల్లో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. అన్నపర్రులో జెడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ విద్యార్థులకు అందజేశారు. కొప్పర్రు పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు షేక్ రమేష్, సర్పంచ్ సాతులూరి సురేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేజండ్ల జెడ్పీ హైస్కూలులో..



కాకుమాను హైస్కూలులో.....



యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెదకాకాని: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి సూచించారు. పెదకాకాని బాజీనగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని తప్పక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రయోజకుల్ని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. రామకృష్ణ, స్థానిక పెద్దలు షేక్ నజీర్, షేక్ ఆరిఫ్, షేక్ షరీఫ్, బాషా పాల్గొన్నారు.



ప్రత్తిపాడు హైస్కూలులో జగనన్న విద్యాకానుక కిట్లతో విద్యార్థుల ఆనందాలు



రామానగర్ కాలనీ పాఠశాలలో విద్యార్థులను చేర్చుతున్న అంగన్‌వాడీలు



ప్రత్తిపాడు హైస్కూల్లో విద్యార్థులను తీసుకు వచ్చిన తల్లులు

బడి గంటలు మోగిన వేళ..

బడి గంటలు మోగాయి. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పుస్తకాల బ్యాగులతో చిన్నారులు భారమైన హృదయాలతో బడులకు పయనమయ్యారు. కొన్ని పాఠశాలల్లో నిర్ణీత సమయం కన్నా ముందుగానే చిన్నారులు బడులకు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి తొలి రోజు దుమ్ము కొట్టుకున్న విద్యాలయాల్ని పరిశుభ్రం చేసుకున్నారు. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం చిన్నారులు పాఠశాలలకు వెళ్లనని మారాం చేయడంతో అమ్మమ్మలు, నానమ్మలు, తల్లిదండ్రులు వారిని తీసుకువెళ్లారు. తొలిరోజే జగనన్న విద్యాకానుక పంపిణీ చేయడంతో తీసుకునేందుకు విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కూడా పాఠశాలలకు వచ్చారు. ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు హైస్కూల్స్‌లో ఆరవ తరగతికి అడ్మిషన్లు తీసుకోగా, పది పూర్తి చేసుకున్న విద్యార్థులు టీసీల కోసం బడులకు వచ్చారు.

– ప్రత్తిపాడు



భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యార్థులు, వెంట వారి తల్లిదండ్రులు



ఎమ్మార్సీలోని స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు పాఠ్య పుస్తకాల తరలింపు



ప్రత్తిపాడు హైస్కూలులో టీసీకి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థినులు



వట్టిచెరుకూరు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థికి యూనిఫాం పంపిణీ

శివాలయం వివాదానికి తెర

ఏసీ శ్రీనివాసరెడ్డితో హిందూ సంఘాల ప్రతినిధుల చర్చలు

పెదకాకాని: స్థానిక శివాలయం వివాదానికి తెరపడింది. గత నాలుగు రోజులుగా ఆలయ దినచర్యలపై కొందరు వాస్తవాలతో పాటు అవాస్తవాల్ని ప్రచారం చేశారు. అధికారుల్ని అసభ్య పదజాలంతో మాట్లాడుతున్న వీడియోలు ఫేస్‌బుక్‌లు, వాట్సాప్‌ల్లోనూ పెట్టారు.దీంతో పలు హిందూ ధర్మ సంఘాల ప్రతినిధులు సోమవారం ఆలయానికి చేరుకున్నారు. వారితో ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో చర్చలు జరిపారు. గతంలో క్యాంటీన్‌లో చికెన్‌తో దొరికిపోయిన షరీఫ్ ప్రస్తుతం రావడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆలయం ముందు రోడ్డులో వెళ్లిన మృతదేహంపై చల్లిన పూలు ఊడ్చిన సిబ్బంది, వాటిని ట్రాక్టర్ ట్రక్కులో వేయడంపై తప్పు పట్టారు. యాగశాల ఇప్పటికే మూడు సార్లు నిర్మించడం, పగలగొట్టడంపై వివరణ కోరారు. దీనిపై ఏసీ స్పందిస్తూ క్యాంటిన్ వద్దకు షరీఫ్ రావడంపై ఇప్పటికే నిర్వాహకుడికి నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ఇటీవల ఫేస్‌బుక్ వీడియోల్లో అన్యమతస్తులు, అరాచకాలంటూ అధికారుల్ని సైతం అసభ్యంగా మాట్లాడటం మంచిదికాదని తెలిపారు. ఏళ్ల తరబడి ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందిని అన్యమతస్తులు అంటూ పేర్లు పెట్టి మాట్లాడటంపై ఆలయ సిబ్బంది కూడా సంఘ ప్రతినిధుల్ని నిలదీయడంతో కులం పేరుతో మాట్లాడం తప్పే.. క్షమించండి అని వారు కోరడంతో వివాదం సద్దుమణిగింది. హిందూ సంఘాల ప్రతినిధులు ఆలయానికి చేరుకుని ధర్నాలు, నిరసనలు చేస్తున్నారంటూ ప్రచారం జరగడంతో పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు ముందస్తు శాంతిభద్రతల్లో భాగంగా పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఆలయానికి స్థానిక ప్రజలు కూడా అధికసంఖ్యలో చేరుకున్నారు. శివాలయ పవిత్రను కాపాడాలని ఆర్ఎస్ఎస్ మాజీ మీడియా కోఆర్డినేటర్ హర్షవర్ధన్‌శాస్త్రి ఏసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూ సంఘ ప్రతినిధులు లక్ష్మీ రామానుజ దాసు, సాయి శరత్‌శర్మ, ఎస్సీ మోర్చా కార్యదర్శి డి. శ్రీనివాస్, టి. రాజేష్ పాల్గొన్నారు.



ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో మాట్లాడుతున్న హిందూ సంఘాల ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో విగ్రహ పునఃప్రతిష్ట

కొల్లిమర్ల(కాకుమాను): మండలంలోని పాత కొల్లిమర్లలో గల అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉత్సవమూర్తుల విగ్రహ పునఃప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. దేవదాయశాఖ, గ్రామస్తుల సహకారాలతో పురాతన ఆలయాన్ని పునరుద్ధరించారు. అందులో ఉత్సవమూర్తుల విగ్రహ పునఃప్రతిష్టను దేవాలయ చైర్మన్ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కన్నుల పండువలా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పాల్గొన్నారు. విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట సందర్భంగా దేవస్థాన ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, సర్పంచ్ విప్పడపు రాంబాబు, గడ్డం కోటేశ్వరరావు, వీరాస్వామి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న దయాసాగర్

ఆకట్టుకున్న మాథ్స్ ఎగ్జిబిషన్



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మాథ్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన రేఖా గణితంలోని పలు ఆకృతుల్ని ప్రదర్శించారు. శంఖు నుంచి వివిధ ఆకృతులైన గోళం, ఎలిప్స్, పెరాబుల వంటి రేఖా గణిత ఆకృతుల విశేషాల్ని వివరించారు. ఉత్తమ ప్రదర్శనలకు కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు బహుమతుల్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, గణిత శాస్త్ర, కంప్యూటర్ విభాగాధిపతులు భవానీదుర్గ, ఏ. శ్రీధర్, అధ్యాపకులు చంద్రశేఖర్, మల్లీశ్వరి, శ్రీలక్ష్మి, రాజరాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్త సమాజ బృంద సభ్యులకు సన్మానం



చేబ్రోలు: స్థానిక యాదవపాలెంలోని సీతారామాంజనేయ భక్త సమాజ బృందం సభ్యుల్ని సోమవారం చేబ్రోలు వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. గ్రామంలో సీతారామ మందిరాన్ని 2010లో పునర్నిర్మించారు. అప్పటి నుంచి సీతారామాంజనేయ భక్త బృందం సభ్యులు ప్రతి సోమవారం దైవ కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తున్నారు. భక్త బృందం సభ్యుల్ని ప్రోత్సహిస్తూ వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు, గ్రామ ఉప సర్పంచ్ చేబ్రోలు నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీల్డు టెండరు-కమ్-బహిరంగ వేలం-ప్రకటన

గుంటూరు జిల్లా, వట్టిచెరుకూరు మండలం, కొవెలమూడి గ్రామంలో దేవదాయ ధర్మదాయశాఖ పరిపాలనలో ఉన్న నల్లకుంట చెరువు సర్వేనెంబరు 32లో గల య. 6.55 సెంట్లు చెరువు గట్టులను చెరువు మట్టితో బలోపేతము చేయు పనులు మరియు చెరువులోని పూడిక మట్టిని బయటకు తరలించు పనులు నిర్ణయించబడిన కొలతల ప్రకారం చేయుటకు ది. 19-06-2023 సోమవారం ఉదయం 10:00 గం॥లకు సదరు చెరువు వద్ద సీల్డు టెండరు-కమ్- బహిరంగ వేలము జరుపబడును.

ఈ టెండరు కమ్ బహిరంగ వేలంనకు నిర్ణీత విలువ రూ. 6,10,000/-లుగా నిర్ణయించట మైనది. నిర్ణీత విలువ కంటే అధిక మొత్తమునకు టెండరు వేయవలెను. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు రుసుము రూ. 500/-లు చెల్లించి, ది.16-06-2023 శుక్రవారం మ॥ 2:00 గం॥లలోగా పొంద వలెను. పూరించిన దరఖాస్తుతో పాటు, ప్రథమ ధరావత్తు నిమిత్తం రూ. 50,000/- విలువ గల బ్యాంకు డి.డి.ని Sri Nallakunta Cheruvu, Kovelamudi పేరున తీసి జతపరిచి పంపవలెను. పూర్తి చేసిన దరఖాస్తును ది.17-06-2023 సాయంత్రం 3-00 గం॥లలోగా చేరునట్లు పంపవలెను. వేలం జరుగు రోజున కూడా ప్రథమ ధరవత్తు రూ.50,000/- చెల్లించి పాటలో పాల్గొనవచ్చును. పూర్తి వివరములకు కొవెలమూడి గ్రామ పంచాయితీ కార్యాలయం లోని నోటీసు బోర్డు నందు చూడవచ్చును. మరిన్ని వివరములకు కార్యనిర్వహణాధికారి సెల్ ఫోన్ నెంబరు 8704281004 ద్వారా తెలుసుకొనవచ్చును.

తేది: 12-06-2023
స్థలము: కొవెలమూడి

సం/- కార్యనిర్వాహణాధికారి,
నల్లకుంట చెరువు, కొవెలమూడి.